క్లుప్తంగా

బాధిత కుటుంబానికి చేయూతనందిస్తాం



బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న ఆర్డీఓ మల్లికార్జునరెడ్డి

ఆళ్లగడ్డ: మట్టిమిద్దె కూలి మృతిచెందిన గురుశేఖర్‌రెడ్డి కుటుంబానికి ప్రభుత్వం తరపున చేయూతనందిస్తామని నంద్యాల ఆర్డీఓ మల్లికార్జునరెడ్డి అన్నారు. చాగలమర్రి మండలం చిన్నవంగళి గ్రామంలో మట్టిమిద్దె పైకప్పు కూలి నలుగురు కుటుంబ సభ్యులు మృతి చెందిన విషయం తెలుసుకున్న ఆర్డీఓ శుక్రవారం పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలకు చేరుకుని మృతదేహాలను పరిశీలించి నివాళులర్పించారు. కుటుంబంలో ప్రాణాలతో ఉన్న ఏకైన బాలిక ప్రసన్నకు అవసరమైన వసతులు, సౌకర్యాలు కల్పిస్తామన్నారు.

ఘనంగా పింగళి వెంకయ్య జయంతి వేడుకలు



పింగళి వెంకయ్యకు నివాళులర్పిస్తున్న దృశ్యం

ఆళ్లగడ్డ: జాతీయ పతాక రూపకర్త, స్వాతంత్ర సమరయోధుడు పింగళి వెంకయ్య జయంతి వేడుకలు శుక్రవారం ఆళ్లగడ్డలో ఘనంగా నిర్వహించారు. ప్రైవేటు పాఠశాలల సంఘం డివిజన్ అధ్యక్షుడు అమీర్‌బాషా ఆధ్వర్యంలో స్థానిక గౌతం పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో పింగళివెంకయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. నేటి యువత పింగళి వెంకయ్యను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రశాంతి, ఉపాధ్యాయులు ఉన్నారు

దివ్యాంగులకు నిత్యావసర సరుకుల పంపిణీ



సరుకులను పంపిణీ చేస్తున్న దృశ్యం

నంద్యాల(అర్బన్): పట్టణంలోని 13వ వార్డు వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ కాల్వ సరస్వతి దంపతులు శుక్రవారం 20 మంది దివ్యాంగులకు నెలకు సరిపడా నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. రాయలసీమ వికలాంగుల సేవా సమితి అధ్యక్షుడు బాలసుబ్బయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు కాల్వనాగరాజు మాట్లాడుతూ దివ్యాంగులకు ప్రతి ఏడాది ఇలాంటి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు. కార్యక్రమంలో కర్నాటి చాణక్య, ప్రియాంక, మిథాలి, సంజీవ రాయుడు, వెంకటేశ్వర్లు, ఖాజావలి పాల్గొన్నారు.

నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలి

నంద్యాల(న్యూటౌన్): మృత్యువాత పడ్డ కుటుంబ సభ్యులను రాష్ట్ర ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు, సహాయ కార్యదర్శి బాబాఫకృద్దీన్ డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ చాగలమర్రి మండలం చిన్నవంగళిలో మిద్దె కూలి ఒకే కుటుంబానికి చెందిన నలుగురు మరణించడం బాధాకరమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆ కుటుంబాన్ని ఆదుకోవాలన్నారు.

అమ్మవార్లకు ప్రత్యేక పూజలు

నంద్యాల(వ్యవసాయం): ఆషాఢ మాసాన్ని పురస్కరించుకొని శుక్రవారం వివిధ దేవాలయాల్లో అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. పట్టణంలోని రమాసమేత సత్యనారాయణ స్వామి, నూనెపల్లె అమ్మశాల, నిమిషాంబదేవిలకు శాకాంబరిగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. అనంతరం మహామంగళ హారతులు ఇచ్చి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కాళికాంబదేవస్థానంలో చివరి శుక్రవారం ఆషాఢ మాసాన్ని పురస్కరించుకొని అమ్మవారికి ప్రత్యేక పూజలు, ప్రత్యేక అలంకారాలు చేశారు. అమ్మవారి ఉత్సవ మూర్తికి సాయంత్రం శ్రీకాళిమాత సేవా సమితి ఆధ్వర్యంలో కనకాభిషేకం నిర్వహించారు. దేవాలయ ఆవరణలో అమ్మవారి చిత్రపటాల ప్రదర్శన నిర్వహించారు. సాయంత్రం దేవాలయ ఆవరణలో పల్లకీ ఉత్సవాన్ని నిర్వహించి భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

ప్రైవేట్ పాఠశాలలో ఫుడ్ పాయిజన్ కలకలం

నంద్యాల(అర్బన్): పట్టణంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో ఫుడ్ పాయిజన్‌తో విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. గురువారం సదరు పాఠశాలలో ఓ కార్యక్రమం సందర్భంగా నిర్వహించిన డిన్నర్‌లో ఆహార పదార్థాలు కలుషితమైనట్లు సమాచారం. వీటిని తీసుకున్న విద్యార్థులు అస్వస్థతకు గురి కావడంతో వెంటనే యాజమాన్యం వైద్యులను పిలిపించి అక్కడే వైద్య సేవలు అందించగా అందరూ కోలుకున్నట్లు తెలుస్తోంది.

74 బృందాలు.. 42 వేల డోస్‌లు

- పశువుల్లో ముద్ద చర్మ వ్యాధి నివారణకు టీకాలు
- జిల్లాలో ముమ్మరంగా లంపీ స్కిన్ వ్యాక్సినేషన్



లంపీ స్కిన్ సోకిన పశువులు



టీకాలు వేస్తున్న పశువైద్య సిబ్బంది

గోస్పాడు: పశువులకు సోకే అతి ప్రాణాంతక వ్యాధుల్లో ప్రధానమైనది ముద్ద చర్మం (లంపీస్కిన్) వ్యాధి. ఈ వ్యాధి అధికంగా తెల్లజాతి పశువుల్లో వస్తోంది. పశుపోషకులు చిన్నపాటి నిర్లక్ష్యం చేసినా మూగజీవాలు మృతి చెందే అవకాశం ఉందని పశు వైద్యులు హెచ్చరిస్తున్నారు. వ్యాధి నివారణకు జిల్లాలో జూలై 20వ తేదీ నుంచి లంపీ స్కిన్ వ్యాక్సినేషన్ ముమ్మరంగా కొనసాగుతోంది. 74 బృందాలతో 96,450 పశువులకు ఉచితంగా వ్యాక్సిన్లు వేసేలా లక్ష్యం కాగా అన్ని డివిజన్, మండల కేంద్రాల్లో పశువైద్యులకు, సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ మేరకు వ్యాక్సిన్లు పశువైద్య కేంద్రాల్లో అందుబాటులో ఉంచారు. అయితే జిల్లాలో ఇప్పటికే 42 వేల పైగా వ్యాక్సిన్లు వేసినట్లు సంబంధిత అధికారులు చెబుతున్నారు. ఈ కార్యక్రమం ఈనెల 18వ తేదీ వరకు కొనసాగనుంది. ఈ వ్యాధి సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వ్యాధి సంక్రమిస్తే నివారణ చర్యలను ఎప్పటికప్పుడు గ్రామ స్థాయి నుంచి పశుపోషకులకు అవగాహన కల్పించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు.

వ్యాధి సంక్రమణ ఇలా..

పశువులను ఆశించే కీటకాల ద్వారా వ్యాధి వ్యాప్తి చెందుతుంది. వేడి, తేమతో కూడిన వాతావరణం ఉన్న నెలల్లో వ్యాధి వ్యాప్తి ఎక్కువ. జోరీగ, రక్తం పీల్చే ఈగలు, దోమలు, కొడుసుల ద్వారా కూడా వ్యాప్తి చెందుతుంది. కొన్నిసార్లు రైతులు వ్యాధి సోకిన పశువులను ఇతర పశువులతో కలపడం, వాటి దాణా పాత్రలు వీటికి వినియోగించడం ద్వారా కూడా వ్యాప్తి చెందుతుంది.

వ్యాధి లక్షణాలు..

- పశువుల శరీరంపై చిన్న గడ్డలు, ముద్దలు ఏర్పడతాయి.
- అధిక జ్వరంతో బాధపడతాయి.
- కళ్ల నుంచి నీరు కారడం, ముక్కు, నోటి ద్వారా సొంగలు వస్తాయి.
- శరీరమంతా కణతులు, బొడిపెలు, రక్తం కారే పుండ్లు ఏర్పడతాయి. పక్కటెముకలు, కాళ్లు, వెన్నుముక, పొదుగు, కను రెప్పలు తదితర భాగాలకు వ్యాప్తి చెందుతాయి. వీటి ప్రభావం 7 నుంచి 12 రోజులు వరకూ ఉంటుంది.
- పశువులు బలహీనంగా, అలసటగా కనిపిస్తాయి.
- వ్యాధి సోకిన పశువులు తక్కువగా పాలు ఇస్తాయి.

చికిత్స విధానం..

- బాధి సోకిన పశువులను మిగిలిన పశువుల నుంచి వేరు చేయాలి.
- పశువైద్యులను సంప్రదించి చికిత్స అందజేయాలి. వ్యాధి తీవ్రత బట్టి మందులు వాడాలి.
- జ్వరం, కాళ్ల వాపు అధికంగా ఉంటే తగిన యాంటీ ఇన్ ఫ్లమేటరీ మందులు అందించాలి.
- గుంతలతో కూడిన గాయాలు ఏర్పడితే యాంటీ బయాటిక్‌తో కూడిన ఆయింట్మెంట్ వాడాలి.
- దోమలు, ఈగలు వ్యాప్తి చెందకుండా పశువైద్యుని సూచన మేరకు మందులు వినియోగించాలి.
- హోమియో, ఆయుర్వేద మందులు తిప్పతీగ, నేల వేము తదితర వ్యాధి నిరోధక శక్తి పెంచే మందులు వాడటం శ్రేయస్కరం.

వ్యాధి నివారణ...

- బాధిత పశువులను ఇతర ప్రదేశాలకు తరలించరాదు. సంతలో క్రయ విక్రయాలు చేయకూడదు.
- వ్యాధి ప్రభావిత ప్రాంతం నుంచి పశువులు వలస వెళ్లకుండా చూడాలి.
- కీటకాల నియంత్రణ, దోమతెరల వినియోగం, పశువులు తొట్టెలు (దాణా పాత్రలు) శుభ్రం చేయాలి. వేపాకు ధూపం వేయాలి.
- ఏదైనా లక్షణాలు కనిపిస్తే వెంటనే స్థానిక పశువైద్యులను సంప్రదించాలి.

టీకాలు తప్పక వేయించాలి



ముద్ద చర్మవ్యాధి పశువులకు ప్రమాదకరం. సరైన జాగ్రత్తలు తీసుకుంటే వ్యాధిని నివారించవచ్చు. ప్రభుత్వం ద్వారా అందిస్తున్న వ్యాక్సిన్ వినియోగిస్తే ఈ వ్యాధి నుంచి పశువులను కాపాడుకోవచ్చు. ప్రతి రైతు పశువైద్యాధికారుల సలహాలు పాటించి తమ పశువులను ఆరోగ్యంగా ఉంచుకోవాలి. పశువుల కోసం వేస్తున్న ముద్దచర్మ వ్యాధి నివారణ వ్యాక్సిన్‌ను రైతులు పశువులకు వేయించుకోవాలి.

– గోవిందనాయక్, జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి, నంద్యాల

మత్తుతో విలువైన జీవితం నాశనం



మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి ప్రసాద్

ఆళ్లగడ్డ: మత్తు పదార్థాల వినియోగంతో విలువైన జీవితం చేజేతుల నాశనమవుతుందని ఆళ్లగడ్డ జూనియర్ సివిల్ జడ్జి ఈశ్వర వెంకట ప్రసాద్ అన్నారు. స్థానిక ప్రజ్ఞ విద్యాసంస్థలో శుక్రవారం మండల న్యాయ సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ విజ్ఞాన సదస్సులో మాదక ద్రవ్యాలు - విద్యార్థులపై ప్రభావం అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ యువత చెడు స్నేహాలతో సరదాగ ప్రారంభించిన మాదక ద్రవ్యాల వినియోగం బంగారు భవిష్యత్తును నాశనం చేస్తుందన్నారు. మత్తుకు అలవాటుపడ్డ వారు సృజనాత్మకతను కోల్పోతారన్నారు. ఎస్ఐ నగీన మాట్లాడుతూ నేరాలకు పాల్పడేవారు అత్యధికం మత్తుకు బానిసలైన వారే అన్నారు. కార్యక్రమంలో డాక్టర్ శబరీష్, కళాశాల నిర్వాహకురాలు హేమలతారెడ్డి ఉన్నారు

99.36% పెన్షన్ల పంపిణీ పూర్తి

నంద్యాల(న్యూటౌన్): జిల్లాలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ శుక్రవారం సాయంత్రానికి 99.36% పూర్తయిందని డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్ రెడ్డి తెలిపారు. జిల్లాలో 2,19,863 మంది పెన్షన్‌దారులుండగా 2,18,4 58 మందికి పంపిణీ చేసినట్లు వెల్లడించారు. ఇంకా 1,405 మంది పెన్షన్లు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. వీరు గ్రామ వీఆర్‌ఓ లేదా సచివాలయ ఉద్యోగులను సంప్రదిస్తే పెన్షన్లు ఇస్తారన్నారు.

అండగా ఉంటాం..అధైర్యపడొద్దు

- కార్యకర్తలకు మాజీ ఎమ్మెల్యే గంగుల భరోసా



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి

ఉయ్యాలవాడ: కార్యకర్తలకు అన్ని విధాలుగా అండగా ఉంటామని, అధైర్యపడవద్దని వైఎస్సార్‌సీపీ మాజీ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి భరోసా ఇచ్చారు. శుక్రవారం మండలంలోని రూపనగుడి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ దేశం విశ్వనాథ్ రెడ్డి కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించారు. మొహర్రం వేడుకల్లో భాగంగా జరిగిన ఘర్షణలో అదే గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు కొట్టి గాయపరిచారు. ఈ విషయం తెలుసుకుని ఆయన బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు నెలలవుతున్నా అభివృద్ధిపై దృష్టి సారించలేదన్నారు. వైఎస్సార్‌సీపీ సానుభూతి పరులపై కక్షసాధింపు చర్యలు, దాడులకు దిగడమే పనిగా ఆ పార్టీ నాయకులు పెట్టుకున్నారన్నారు. ఇప్పటికైనా ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలుపై దృష్టి సారించాలని లేకపోతే ప్రజలే తిరగబడతారన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ దేశం సోమశేఖర్‌రెడ్డి, నాయకులు మన్మోహన్‌రెడ్డి, బుడ్డా చంద్రమోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో నైపుణ్యాలను వెలికితీయండి



కస్తూరిబాగాంధీ విద్యాలయాన్ని పరిశీలిస్తున్న డీఈఓ సుధాకర్‌రెడ్డి

చాగలమర్రి: విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాలను వెలికితీయాలని జిల్లా విద్యాధికారి సుధాకర్‌రెడ్డి ఉపాధ్యాయులకు సూచించారు. శుక్రవారం ఆయన మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ విద్యాలయం, చిన్నవంగళి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం ఆయన రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. మధ్యాహ్న భోజనం విషయంలో జాగ్రతలు పాటించాలని నిర్వాహకులకు సూచించారు. కస్తూరిబా గాంధీ విద్యాలయంలో ఉన్న ప్రహరీ సమస్యను పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో అలెస్కో రఘురామిరెడ్డి, ఎంఈఓ అనురాధ, హెచ్‌ఎంలు జీవయ్య, కోటయ్య, ఎస్‌ఓ సునీత, శేషాద్రి తదితరులు పాల్గొన్నారు.

పంట పెట్టుబడి ఖర్చు తగ్గించుకోవాలి



రుద్రవరానికి సమీపంలో మిర్చి సాగుపై జాగ్రత్తలు వివరిస్తున్న శాస్త్రవేత్తలు

రుద్రవరం: రైతులు పంటల సాగుకు పెట్టుబడులు తగ్గించుకోవాలని, జీవనియంత్రణ పద్ధతులు పాటించాలని యాగంటిపల్లె కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు సుధాకర్, ఆదినారాయణ, రవిగౌడ్ సూచించారు. మండలకేంద్రం రుద్రవరంలో శుక్రవారం వారు కేవీకే ప్రాంతీయ కార్యాలయాన్ని ప్రారంభించి రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యాన పంటలైన మిరప, పసుపు, మామిడిలో పురుగు, తెగుళ్ల నివారణకు రసాయన మందులపై ఆధారపడరాదన్నారు. జీవనియంత్రణ పద్ధతులతో సమగ్ర సస్యరక్షణ చర్యలు చేపడితే మంచి ఫలితం ఉంటుందన్నారు. కృషి విజ్ఞాన కేంద్రం సేవలను ఆళ్లగడ్డ డివిజన్‌లోని రైతాంగానికి అందుబాటులో ఉంచడానికి రుద్రవరంలో ప్రాంతీయ కార్యాలయం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అనంతరం వారు గ్రామ సమీపంలో రైతులు సాగు చేసిన వరి, మొక్కజొన్న, మిరప తదితర పంటలను పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. నేరుగా విత్తే వరి సాగు వల్ల ఎకరానికి రూ.10వేల వరకు పెట్టుబడి ఖర్చు తగ్గించుకోవచ్చని అన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి శ్రీకృష్ణ, ఏఈఓ రాజు తదితరులు ఉన్నారు.

ఉద్యాన పంటల సాగును ప్రోత్సహించండి



సమీక్ష చేస్తున్న ఏపీడీ బాలాజీనాయక్

శిరివెళ్ల: గ్రామాల్లో ఉద్యాన పంటల సాగును ప్రోత్సహించాలని ఉపాధి హామీ పథకం ఏపీడీ బాలాజీనాయక్ సూచించారు. శుక్రవారం స్థానిక ఉపాధి కార్యాలయంలో పంటల సాగుపై సమీక్ష చేశారు. గ్రామాల వారీగా పంట సాగు లక్ష్యాలు, సాగుపై టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లతో ఆరా తీశారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఈ ఏడాది 6,400 ఎకరాల్లో పంటలు సాగు లక్ష్యం కాగా ఇంత వరకు 1,125 మంది రైతులు సాగుకు ముందుకు వచ్చారన్నారు. అలాగే శిరివెళ్లలో వంద ఎకరాలు లక్ష్యం కాగా 28 మంది రైతులు 30 ఎకరాల్లో సాగుకు ముందుకు వచ్చారన్నారు. మునగ, పూలు, సపోటా, మామిడి, కొబ్బరి తదితర పంటల సాగుకు ప్రభుత్వం రాయితీ ఇస్తుందన్నారు. పంటల సాగు రైతులకు ఎంతో లాభదాయకమన్నారు. ఈ విషయాన్ని వారికి తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో ఈసీ సుబ్బరాయుడు పాల్గొన్నారు.

నారుమడుల సాగులో జాగ్రత్తలు అవసరం



నారుమడిని పరిశీలిస్తున్న అధికారులు

నంద్యాల(అర్బన్): నారుమడుల సాగులో రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని నంద్యాల మండల వ్యవసాయాధికారి ప్రసాద రావు తెలిపారు. నారుమడుల యాజమాన్య పద్ధతుల్లో భాగంగా శుక్రవారం నంద్యాల మండలం మునగాల, రాయమాల్పురం గ్రామాల్లో ఆయన నారుమడులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడుతూ నారు పోసేముందు విత్తన శుద్ధి చేయాలన్నారు. తడి విత్తన శుద్ధికి కార్బండిజమ్ 1 గ్రాము, పొడి విత్తన శుద్ధికి 3 గ్రాముల మందును కిలో విత్తనానికి కలిపి విత్తుకోవాలన్నారు. 5 సెంట్ల నారుమడికి 2 కేజీల నత్రజని, 1కేజీ భాస్వరం, 1 కేజీ పొటాష్యం, ఎరువులు వాడాలన్నారు. అదేవిధంగా రెండు గ్రాముల జింక్‌ను ఒక లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు.

ప్రజాపంపిణీ వ్యవస్థ బలోపేతమే లక్ష్యం

నంద్యాల(అర్బన్): ప్రజాపంపిణీ వ్యవస్థ, పౌర సరఫరాల నిఘా వ్యవస్థ బలోపేతమే ప్రభుత్వ లక్ష్యమని జాయింట్‌కలెక్టర్ విష్ణుచరణ్ తెలిపారు. సరుకుల నాణ్యత, పౌరసరఫరాల పనితీరుపై శుక్రవారం సాయంత్రం కలెక్టర్ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో ఓపెన్ హౌస్ మేధో మథనం నిర్వహించారు. ఈ సమావేశంలో జేసీ మాట్లాడుతూ జిల్లాలో పౌర సరఫరాల వ్యవస్థ సేవల మెరుగుకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఇందు కోసం ప్రజాభిప్రాయ సర్వే చేపట్టినట్లు తెలిపారు. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా రైస్ కార్డు దారుల నుంచి సలహాలు, సూచనలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. సమావేశంలో నంద్యాల జిల్లా పౌర సరఫరాల అధికారి వెంకటరాముడు, ఏఎస్‌ఓ రవిబాబు, సీఎస్‌డీటీ ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

చికిత్స పొందుతూ మహిళ మృతి

శిరివెళ్ల: స్థానిక తెలుగు పేటకు చెందిన సుంకి వెంకట లక్ష్మమ్మ (45) కర్నూలులో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందారు. ఎస్ఐ సురేష్ తెలిపిన వివరాల మేరకు... మృతురాలు ఈ నెల 1వ తేదీ రాత్రి ఇంట్లో దోమల నియంత్రణకు జెట్ బిళ్ల పెట్టుకుంది. ప్రమాదవశాత్తు ఆ జెట్‌బిళ్ల వ్యవసాయ పనుల కోసం ఇంటిలో నిల్వ ఉంచుకున్న పెట్రోల్ డబ్బపై పడింది. వెంటనే మంటలు వ్యాపించి మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం కర్నూలుకు తరలించగా కోలుకోలేక మృతి చెందిందన్నారు. కుమారుడు నీలాకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ఇరువర్గాల మధ్య ఘర్షణ

- పరస్పర ఫిర్యాదుల్లో పది మందిపై కేసు నమోదు

మహానంది: మహానందిలోని ఈశ్వర్‌నగర్ కాలనీలో రెండు వర్గాల మధ్య జరిగిన ఘర్షణలో పరస్పర ఫిర్యాదులతో పోలీసులు శుక్రవారం పది మందిపై కేసు నమోదు చేశారు. ఎస్ఐ నాగేంద్రప్రసాద్ తెలిపిన వివరాలు.. ఈశ్వర్‌నగర్‌లో నివాసం ఉంటున్న ఎంపీటీసీ బంగి వెంకటేశ్వర్లు, అతని సోదరుడు రమేష్ ఇంటిమీదికి అదే కాలనీకి చెందిన భూపాల్, శ్రీకాంత్, సుంకన్న, మహేష్, శ్యామ్ రాత్రి దాడి చేశారు. రమేష్‌ను గాయపరచడంతో పాటు ఇళ్ల తలుపులు పగలగొట్టి ఇంటి ముందు ఉన్న బొలేరో వాహనాన్ని ధ్వంసం చేశారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ నాగేంద్రప్రసాద్, పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తెచ్చే ప్రయత్నం చేశారు. మరోవర్గంలోని గాయపడిన భూపాల్ ఫిర్యాదు మేరకు రమేష్, చిన్నబాబు, ఆయన కుమారుడు, సురేష్, అంజిలపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు. బంగి వెంకటేశ్వర్లు ఇంటి వద్ద ఉన్న సీసీ కెమెరాల్లో రికార్డ్ అయిన దృశ్యాల ఆధారంగా దాడి చేసిన వారిని పోలీసులు గుర్తించి విచారణ చేస్తున్నారు. ఈ విషయంపై జిల్లా ఎస్పీ ఆదిరాజ్ సింగ్ రాణాతో పాటు డీఎస్పీ, సీఐలు ఆరా తీసినట్లు సమాచారం.

డెంగీని నిర్లక్ష్యం చేస్తే ప్రాణాలకు ముప్పు



ఇంటి పరిసరాల్లో మందు స్ప్రే చేయిస్తున్న మలేరియా నివారణ అధికారి

శిరివెళ్ల: డెంగీవ్యాధిని నిర్లక్ష్యం చేస్తే ప్రాణాలకే ముప్పు అని, వ్యాధి లక్షణాలు కనిపించగానే ఆసుపత్రుల్లో చేరి చికిత్స పొందాలని మలేరియా నివారణ జిల్లా అధికారి కామేశ్వరరావు సూచించారు.మండలకేంద్రం శిరివెళ్లలోని రామాలయ వీధిలో 11 ఏళ్ల బాలిక కైపకు డెంగీ నిర్ధారణయింది. శుక్రవారం ఈ విషయం తెలియడంతో ఆయన బాలిక ఇంటిని, పరిసరాలను పరిశీలించారు. అబేట్, పైరేథియం మందును స్ప్రే చేయించారు. అనంతరం జిల్లా అధికారి మాట్లాడుతూ మూడు రోజుల కితం బాలికకు జ్వరం, ఒళ్లు నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు నంద్యాల ప్రభుత్వ వైద్య శాలలో చేర్పించారన్నారు. అక్కడ ఎలీసా పరీక్ష చేయగా వ్యాధి నిర్ధారణ అయిందన్నారు. జనవరి నుంచి ఇప్పటి వరకు జిల్లాలో 125 డెంగీ కేసులు నమోదయ్యాయని చెప్పారు. దోమలు రాకుండా వ్యక్తిగత పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో మలేరియా సబ్ యూనిట్ అధికారి వెంకటేశ్వరరెడ్డి, ప్రభుత్వ వైద్యాధికారి ముఖేష్, సీహెచ్‌ఓ రాంమోహన్‌రెడ్డి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

తల్లిపాలు శిశువుకు సంపూర్ణ ఆహారం



పోస్టర్ విడుదల చేస్తున్న కలెక్టర్, జేసీలు



బాలింతలకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

- అమ్మపాలు ప్రాముఖ్యతపై ప్రజలకు అవగాహన కల్పించండి
- వారోత్సవాల పోస్టర్ ఆవిష్కరణలో జిల్లా కలెక్టర్ రాజకుమారి

నంద్యాల: బిడ్డకు తొలి ఆరునెలల వరకు తల్లిపాలు సంపూర్ణ ఆహారమని జిల్లా కలెక్టర్ రాజకుమారి అన్నారు. దీనిపై ప్రజలకు అవగాహన కల్పించాలని వైద్య సిబ్బందిని ఆమె ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ తన చాంబర్‌లో జాయింట్ కలెక్టర్ విష్ణు చరణ్, డీఆర్‌ఓ పద్మజ, ఇన్‌చార్జి డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ శారదాబాయిలతో కలిసి తల్లిపాల వారోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి తల్లి బిడ్డకు జన్మనిచ్చిన గంటలోపు ముర్రుపాలు తాగించాలని దీంతో బిడ్డకు వ్యాధి నిరోధక శక్తి పెరిగి ఎలాంటి అంటువ్యాధులు సంభవించకుండా ఉంటాయన్నారు. తల్లిపాల ప్రాముఖ్యతను ప్రతి గర్భిణి, బాలింతలకు తెలియజేయాలన్నారు. తల్లి బిడ్డకు పాలు ఇవ్వడం ద్వారా వారి మధ్య బంధం బలపడుతుందన్నారు. ఇన్‌చార్జి డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ మొదటి ఆరు నెలలు బిడ్డకు తల్లిపాలే ఇవ్వాలన్నారు. దీని వల్ల తల్లికి రొమ్ము, గర్భాశయ, అండాశయ క్యాన్సర్ రాదన్నారు. కార్యక్రమంలో జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి ప్రసన్నలక్ష్మి, డాక్టర్లు శ్రీజ, తేజస్విని, శ్రీదేవి, డెమో రవీంద్ర, తదితరులు పాల్గొన్నారు

దొర్నిపాడు:ముర్రుపాలలో రోగనిరోధక శక్తి అధికంగా ఉంటుందని, పుట్టిన వెంటనే పిల్లలకు తల్లి పాలు తాగించాలని సీహెచ్‌ఓ రవికుమార్ సూచించారు. దొర్నిపాడులోని అంగన్‌వాడీ కేంద్ర-3లో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రజుమంలో ఆయన పాల్గొని మాట్లాడారు.

తల్లి పాలు బిడ్డకు శ్రేయస్కరం

నంద్యాల(వ్యవసాయం): పుట్టిన పురిటి బిడ్డకు తల్లి పాలు శ్రేయస్కరమని ఐఎంఏ మిషన్ పింక్ హెల్త్ అధ్యక్షురాలు నెరవాటి అరుణ, డాక్టర్ పద్మజ పేర్కొన్నారు. తల్లిపాల వారోత్సవాలను పురస్కరించుకుని స్థానిక జిల్లా ఆసుపత్రిలో లయన్స్‌క్లబ్, ఐఎంఏ సంయుక్తంగా శుక్రవారం తల్లులకు తల్లిపాలపైన అవగాహన కల్పించారు. డాక్టర్ రవికృష్ణ మాట్లాడుతూ ఐఎంఏ మహిళా విభాగం శాఖలు వారం రోజులు అమ్మపాలు ఆవశ్యకతపై విస్తృత కార్యక్రమాలు నిర్వహిస్తారని తెలిపారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు నిజాముద్దీన్, రమేష్‌బాబు, వైద్యులు శిరీష తదితరులు పాల్గొన్నారు.

గోస్పాడు: తల్లిపాలు బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యం ప్రసాదిస్తుందని గోస్పాడు వైద్య అధికారి గోపాల్ అన్నారు. తల్లి పాల వారోత్సవాలను పురస్కరించుకొని శుక్రవారం గోస్పాడు, జూలేపల్లె గ్రామాల్లో గర్భిణులు, బాలింతలకు తల్లి పాలు - ప్రాముఖ్యతపై అవగాహన కార్యక్రమం నిర్వహించి మాట్లాడారు. కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

రుద్రవరం: తల్లి పాలతో బిడ్డ ఆరోగ్యం పదిలంగా ఉంటుందని రుద్రవరం పీహెచ్‌సీ వైద్యాధికారి శివమోహన్ అన్నారు. శుక్రవారం ఆయన పీహెచ్‌సీలో తల్లి పాల వారోత్సవాల్లో భాగంగా బాలింతలు, గర్భిణులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పుట్టిన బిడ్డకు డబ్బా పాలు పట్టవద్దని సూచిస్తూ వాటి వల్ల కలిగే నష్టాలను వివరించారు.

శిరివెళ్ల: పుట్టిన బిడ్డకు తల్లి పాలు సంజీవిని అని సీడీపీఓ తేజేశ్వరి అన్నారు. శుక్రవారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో తల్లి పాల వారోత్సవాలపై నిర్వహించిన సభలో ఆమె మాట్లాడారు. అంతకు ముందు అంగన్‌వాడీ వర్కర్లు, తల్లులు, వైద్య సిబ్బందితో ర్యాలీ చేశారు. కార్యక్రమంలో ఏంపీపీ నాయక్ వసీం, సర్పంచు సాలమ్మ, ఉప సర్పంచు ఇంతియాజ్,డాక్టర్ ముఖేష్, సీహెచ్‌ఓ రాంమోహన్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ గుర్రప్ప, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

చాగలమర్రి: మండలకేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఐసీడీఎస్ సీడీపీఓ తేజేశ్వరి, సూపర్‌వైజర్ సుశీలమ్మ ఆధ్వర్యంలో నిర్వహించిన తల్లిపాల వారోత్సవాల్లో పీహెచసీ ప్రభుత్వ వైద్యాధికారి అంజలి అతిథిగా పాల్గొని మాట్లాడారు. తల్లిపాలు శిశువు పెరుగుదలకు ఉపయోగపడుతుందన్నారు.

తెలుగుగంగ కాల్వలో అడ్డు కట్టల తొలగింపు



రుద్రవరం: దిగువ భాగాన ఉన్న ఆయకట్టు రైతులకు సాగు నీరు చేరేలా అధికారులు శుక్రవారం తెలుగుగంగ ఉప ప్రధాన కాల్వల్లో ఉన్న అడ్డుకట్టల తొలగింపు పనులు చేపట్టారు. రుద్రవరానికి సమీపాన నల్లమల అటవీ ప్రాంతంలో తెలుగుగంగ ప్రధాన కాల్వ నుంచి 21 వ బ్లాక్ ఉప ప్రధాన కాల్వలో పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా జేఈఈ రాంప్రసాదు మాట్లాడుతూ గత రబీ సీజన్లో రైతులకు వార బందీ పద్ధతిలో సాగు నీరు అందించామన్నారు. అయితే, అప్పట్లో కొందరు రైతులు తమ పొలాలకు నీరు పారించుకునే నిమిత్తం అక్కడక్కడ రాళ్లు,మట్టి సంచులతో అడ్డుకట్టలు వేసుకున్నారన్నారు. ప్రస్తుతం వెలుగోడు బ్యాలెన్సింగ్ రిజర్వాయరు నుంచి తెలుగుగంగ ప్రధాన కాల్వకు నీరు విడుదల చేశారన్నారు.ఆ నీరు ఉప ప్రధాన కాల్వల ద్వారా దిగువ భాగాన ఉన్న ఆయకట్టు పొలాలకు సక్రమంగా నీరు వెళ్లేందుకు అడ్డంకులు తొలగిస్తున్నట్లు తెలిపారు.